మూడు గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

# తుంగభద్రకు పోటెత్తిన వరద

- ప్రమాద హెచ్చరికలు జారీ
- 7,744 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల
- హెచ్‌ఎల్‌సికి 100 క్యూసెక్కులు - 1,24,129 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 95 టిఎంసిలకు చేరిన నీటి నిల్వ

**ప్రజాశక్తి - హొళగుంద**

కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ, ధవనగిరి, రాణి బెన్నూర్, తదితర ప్రాంతాల్లో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు వరద పోటెత్తింది. ప్రస్తుతం రోజుకు 1,24,129 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దిగువకు 7,744 క్యూసెక్కుల నీటిని నదికి, హెచ్‌ఎల్‌సికి 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం తుఫాను ప్రభావంతో అధిక వర్షాలు కురుస్తుండడంతో రోజుకు 1,24,129 క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వస్తున్నట్లు బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర సోమవారం తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 95 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఈ రెండు, మూడు రోజుల్లో రుతుపవనాల కారణంగా మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉంది. గతేడాది జులైలో 11,425 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండేది. ఈఏడాది జులైలో 1,24,129 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మొదలు కావడంతో త్వరలో డ్యామ్‌లోకి పూర్తిస్థాయి నీటిమట్టం నీరు చేరే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చర్చించుకుంటున్నారు. ముందు జాగ్రత్త చర్యగా నీటిని దిగువకు విడుదల చేశారు. వరద ఉధృతి పెరగడంతో సాగునీరు కూడా విడుదల చేశారు. తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే నాలుగు రోజుల్లో తుంగభద్ర డ్యామ్‌కు గరిష్ట స్థాయి నీటిమట్టం 105 టిఎంసిలకు చేరుకునే అవకాశం ఉన్నట్లు బోర్డు అధికారులు పేర్కొన్నారు.

**మూడు గేట్ల ద్వారా నదికి విడుదల**

సోమవారం మూడు గేట్ల ద్వారా 7,744 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వరద ఉధృతి ఇలాగే కొనసాగితే వరద ద్వారా వచ్చే నీటిని పూర్తిగా దిగువకు విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండి, పశువులు, మేకలను మేపేందుకు నదీతీర ప్రాంతాలకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు.

# ఈసారైనా ఇచ్చేరా..?

## - ప్రతి సారీ జిల్లాకు మొండిచేయి - నేడు కేంద్ర బడ్జెట్

**ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి**

**ప్రతి కేంద్ర బడ్జెట్‌లోనూ ఉమ్మడి కర్నూలు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపుతోంది. జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు, రైల్వే ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయించడం లేదు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్నికల నేపథ్యంలో మధ్యంతర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టారు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటయిన నేపథ్యంలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఈసారైనా నిధులు ఇస్తారని జిల్లా ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు...**

ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్నికల నేపథ్యంలో మధ్యంతర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టారు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటయిన నేపథ్యంలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. సీతారామన్ మధ్యంతర బడ్జెట్ 2024-25ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఆర్థిక సంవత్సరం 2025 మొత్తం వ్యయం రూ.47.66 లక్షల కోట్లుగా ప్రభుత్వం అంచనా వేస్తోందన్నారు. రుణేతర ఆదాయం రూ.30.80 లక్షల కోట్లు ఉండవచ్చుని, నికర రుణాలు రూ.11.75 లక్షల కోట్లుగా ఉండవచ్చుని ప్రభుత్వం అంచనా వేసింది. ఎంఎస్‌ఎంఇలకు ప్రోత్సాహకాలు, అద్దె వ్యవసాయ పనిముట్లు, ప్రకృతి వ్యవసాయాన్ని ఉటంకించింది. ఫలితంగా ఉద్యోగులకు నిరాశే మిగిలింది. బడా పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూరేలా బడ్జెట్ ఉంది. గ్రామీణ పేదల ఊసే లేదు. గ్రామీణ ఉపాధి హామీ, గ్రామీణ పేద కార్మికులు, ఉద్యోగాలు, ద్రవ్యోల్బణం ఊసే లేదని కేంద్ర బడ్జెట్‌లో జిల్లాలోని ప్రాజెక్టుల ప్రస్తావనే కరువైంది. జిల్లాలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల కేటాయింపుల అతీగతి లేదు. రంగాల వారీగా పద్దులు ప్రకటించడం మినహా స్పష్టత కరువైంది. రాష్ట్ర విభజన జరిగిన ఏడేళ్లు గడిచిన నేపథ్యంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల విడుదల జాడే కనిపించలేదు. కేంద్ర విద్యాసంస్థలకు నిధుల ప్రస్తావనలేదు. మంగళవారం ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఈసారైనా నిధులు ఇస్తారని జిల్లా ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

**రైల్వేపై చిన్నచూపు...**

రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చిన్నచూపు చూస్తోంది. కొత్త రైళ్లు, కొత్త రైల్వే లైన్లకు ఒక్క పైసా కూడా కేటాయించడం లేదు. కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకూ గతంలో రైలు ఉండగా దాన్ని రద్దు చేశారు. దాన్ని తిరిగి నడపాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. కాచిగూడ నుంచి గుంటూరుకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును విజయవాడ వరకూ పొడిగించాలన్న ప్రజల ఆకాంక్ష నెరవేరలేదు. కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లాలంటే డోన్ మీదుగా వెళ్లాల్సి వస్తుండటంతో సమయం ఎక్కువ పడుతోంది. కర్నూలు నుంచి ఓర్వకల్లు, పాణ్యం మీదుగా నంద్యాలకు కొత్తగా రైల్వే లైన్ వేస్తే ప్రయాణ సమయం తగ్గిపోనుంది. జిల్లాలోని పుణ్యక్షేత్రాలను కలిపేలా మంత్రాలయం కర్నూలు - శ్రీశైలం కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. అయితే గత బడ్జెట్లో వీటి ప్రస్తావన ఏ మాత్రం లేకుండా పోయింది.

**కోచ్ ఫ్యాక్టరీకి శూన్యం...**

కర్నూలు సమీపంలో ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్ తయారీ ఫ్యాక్టరీకి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యమే. మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని అలంపూర్ రోడ్డు, కర్నూలు జిల్లా పరిధిలోని ఇ.తాండ్రపాడు, పంచలింగాల పరిధిలో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.562 కోట్లతో 123 ఎకరాల్లో దాని ఏర్పాటు పనులను ప్రారంభించారు. అవసరమైన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఈ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు ముందుకు సాగడం లేదు.

# సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

**- కలెక్టర్ రంజిత్ బాషా**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా స్థాయి, మండలస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్‌ఎస్)కు వచ్చిన ప్రజల నుంచి వినతులను కలెక్టర్ పి.రంజిత్ బాషా, జెసి నారపురెడ్డి మౌర్య స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తున్న వినతుల పరిష్కారానికే అధికారులు మొదటి ప్రాధాన్యత ఇస్తూ వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల జిల్లా అధికారులకు అందజేస్తూ, దరఖాస్తును పరిశీలించి అర్జీదారునికి సంతృప్తినిచ్చేలా పరిష్కారం ఇవ్వాలని ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత దరఖాస్తులకు తగిన పరిష్కారం చూపాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డిఒలు, తహశీల్దార్లను ఆదేశించారు. కోడుమూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన వికలాంగుడు గోరంట్ల వీల్ చైర్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రాగా కలెక్టర్ అతని దగ్గరకు వెళ్లి సమస్య గురించి ఆరా తీశారు. దరఖాస్తు చేసుకోవాలని, జిల్లాకు మంజూరయిన వెంటనే అర్హత మేరకు అందజేస్తామని కలెక్టర్ దరఖాస్తుదారునికి తెలిపారు. డిఆర్‌ఒ మధుసూదన్ రావు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

# ప్రజా క్షేత్రంలో ఉంటూ పని చేయాలి

- ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం కావాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

ప్రతి సిపిఎం కార్యకర్త ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజలతో మమేకమై పని చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం కావాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కార్మిక, కర్షక భవన్‌లో సిపిఎం జిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, పిఎస్.రాధాకృష్ణ, జిల్లా నాయకులు ఎస్.అలివేలమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గఫూర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి మాట్లాడారు. 2024 పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరుగుతున్న మొదటి జిల్లా స్థాయి సమావేశం ఇది అని తెలిపారు. జిల్లాలో పార్టీ సభ్యులుగా చేస్తున్న కృషి పట్ల సంపూర్ణంగా ఆయా స్థాయిల్లో చర్చించి పనిని మరింత మెరుగు పరుచుకోవాలని చెప్పారు. రాష్ట్ర రాజకీయాల్లో మార్పు జరిగినా, దేశ రాజకీయాల్లో మార్పు లేకపోయినా బలాబలాల్లో మార్పు జరిగిందని తెలిపారు. రాజకీయం ఏదైనా ప్రజల బతుకుల్లో మార్పు జరగకుంటే ఒరిగేదేమీ లేదన్నారు. సిపిఎం సభ్యులుగా ప్రజల్లో మమేకమై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, పరిష్కారానికి సహాయ పడాలని సూచించారు. ప్రాంతాల వారీగా ప్రజలు తాగు, సాగునీటి సమస్యలతో పాటు, యువకులు నిరుద్యోగ సమస్యను కూడా తీవ్రంగా ఎదుర్కొంటున్నారని తెలిపారు. మూడు రాష్ట్రాలకు మధ్య ప్రాంతంగా ఉన్న కర్నూలును పారిశ్రామిక హబ్‌గా మార్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశులు, రామకృష్ణ, నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, నరసింహ, అంజిబాబు, అరుణ, రాముడు, రాజశేఖర్, లింగన్న, నగేష్, గురుశేఖర్, వీరశేఖర్, హనుమంతు, విజయ్, మధు, మోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

## జిల్లాలో పనిచేయడం సంతృప్తిగా ఉంది

**జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :** జిల్లాలో పనిచేయడం చాలా సంతృప్తిగా ఉందని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. సోమవారం ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం తిరుపతి మున్సిపల్ కమిషనర్ గా బదిలీ అయిన నేపథ్యంలో రిలీవ్ అయి వెళుతున్న సందర్భంగా అధికారులను ఉద్దేశించి జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. బదిలీల్లో భాగంగా తిరుపతి నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్‌గా ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. అందులో భాగంగా కర్నూలు జాయింట్ కలెక్టర్ బాధ్యతల నుండి రిలీవ్ అయి బుధవారం తిరుపతి నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలో భవిష్యత్తులో విధులు నిర్వహించే అవకాశం వస్తే తప్పనిసరిగా వినియోగించుకుంటానని తెలిపారు. ఎన్నికల్లో మంచి సహాయ సహకారాలు అందించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ మధుసూదన్ రావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సమాచారం లేకుండా కమిషనర్‌కు వీడ్కోలు

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు నగరపాలక సంస్థలో గత రెండు సంవత్సరాలుగా పనిచేసి బదిలీపై గుంటూరు జెసిగా ఎ. భార్గవ్ తేజకు మీడియాకు ఎలాంటి సమాచారం లేకుండా వీడుకోలు సమావేశం నిర్వహించారు. అధికారుల సైతం ఆయన వీడుకోలు సభ నిర్వహించి మమ అనిపించారు.

## తహసీల్దార్‌కు వీడ్కోలు సన్మానం

**ప్రజాశక్తి- సి బెళగల్**

మండలానికి ఎన్నికల వేళ పొరుగు జిల్లా నుండి తహసీల్దార్ అనుపమ బదిలీపై వచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం సొంత జిల్లాకు బదిలీ కావడం రిలీవ్ అవడంతో ఎంపిడిఒ శకుంతల, ఇఒఆర్‌డి సందీప్, ఎఒ మల్లేష్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గోనెనాయక్, రెవిన్యూ సిబ్బంది వీడ్కోలు సన్మానం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనుపమ మాట్లాడుతూ ప్రజలకు మంచి అందిస్తే ప్రజాదరణ ఎక్కడున్నా దక్కుతుందని పేర్కొన్నారు.

## రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

నంద్యాల జిల్లా లింగస్వామి హత్య నిందితులను,సత్యసాయి జిల్లా సూర్యనారాయణ హత్య, ఆళ్లగడ్డ పట్టణంలో శ్రీనుపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి. గురుశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వీరనారి ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలో రజకులపై హత్యలు ,రజక మహిళలపై అత్యాచారం హత్యలు, పట్టణ ప్రాంతాల్లో అపార్టుమెంట్ వాచ్మెన్ కం ఇస్త్రీదారులపై అపార్టుమెంట్ యాజమాన్య కమిటీలు దాడులు, దౌర్జన్యాలు అక్రమ కేసులు బనాయించి వేధింపులు చేస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శ్రమకు తగిన వేతనం అడిగిన చోట సాంఘిక బహిష్కరణలు చేయడం సర్వసాధారణమైపోయిందన్నారు. నంద్యాల జిల్లా పాములపాడు మండలం ఇస్కాల్ గ్రామంలో రజక కులానికి చెందిన లింగస్వామిని దారుణంగా హత్య చేయడం, సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన చాకలి సూర్యనారాయణ అనే వ్యక్తిని ధర్మవరం రూరల్ కొత్తకోట గ్రామ సమీపాన హత్య చేయడం, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో శీనుపై హత్య చేయడం కొరకు ప్రయత్నం చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

రజకులపై దాడులను అభ్యుదయ ,లౌకిక ,ప్రజాతంత్ర వాదులు తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు సి. శేషాద్రి కర్నూలు జిల్లా అధ్యక్షుడు సి ముక్కన్న జిల్లా ఉపాధ్యక్షుడు సి .రాముడు, జిల్లా కమిటీ సభ్యులు హొళగుంద నాగరాజు తీవ్రంగా ఖండించారు. నేడు హత్యకు గురైన లింగస్వామి , సాకలి సూర్యనారాయణ, శీను పై హత్యాయత్నం హత్య నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాదలని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## తొమ్మిదికి చేరిన నామినేషన్లు

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు నగరపాలక సంస్థ స్థాయా సంఘం కమిటీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల సంఖ్య తొమ్మిదికి చేరింది. సోమవారం ఐదుగురు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. 7వ వార్డు కార్పొరేటర్ పి.జుబేర్ అహ్మద్, 10వ వార్డు కార్పొరేటర్ షేక్ యూనుస్ బాష, 23వ వార్డు కార్పొరేటర్ కటారి పల్లవి, 24వ వార్డు కార్పొరేటర్ జక్కుల రమణమ్మ, 43వ వార్డు కార్పొరేటర్ కె.మునెమ్మ తమ నామినేషన్ పత్రాలను అదనపు కమిషనర్ రామ లింగేశ్వర్‌కు సమర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్న రాముడు, సెక్రటరీ నాగరాజు, క్లర్క్ జిఎంపి.జుబేర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండించండి: ఆవాజ్

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడిని ఖండించాలని ప్రపంచ దేశాల అధ్యక్షులను, మానవతావాదులను, ప్రజాతంత్ర వాదులను ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎ.సుభాన్ కోరారు. సోమవారం కర్నూలు పాత బస్తీలోని అవాజ్ కమిటీ కార్యాలయంలో ఇజ్రాయిల్ చేస్తున్న , దాడులను ఖండిస్తూ నాయకులు ఎస్ఎండి షరీఫ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎస్ఎ సుభాన్, మౌలానా హిదాయతుల్లాలు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా, ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజలపై దాడులు చేసి ఏకపక్షంగా పిల్ల, జల్ల, మహిళ, ముసలి, ముతక అనే తేడా లేకుండా ఇజ్రాయిల్ దేశాధ్యక్షుడు, నేతన్యాహు బాంబుల వర్షం కురిపిస్తూ, అక్కడి ప్రజల ప్రాణాలను హరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవాస ప్రాంతాలలో, చికిత్స పొందుతున్న, ఆసుపత్రులలో ,ప్రార్థన స్థలాలలో ,అక్కడ ఇక్కడ అనే తేడా లేకుండా అంతర్జాతీయ యుద్ధన్యాయ సూత్రాలను ఉల్లంఘించి, అక్కడి ప్రజలపై తీవ్రంగా దాడి చేస్తున్నప్పటికీ, ఖండించడానికి, ఆదుకోవడానికి ఎవరికి చేతకావడం లేదన్నారు. ప్రపంచ దేశాలు అన్ని కూడా ప్రేక్షక పాత్ర వహించి చూస్తా ఉన్నాయని ,అంతర్జాతీయంగా ఐక్యరాజ్యసమితి అనేకసార్లు, ఇజ్రాయిల్ ఉన్మాదాన్ని కట్టడి చేయాలని ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోతుందన్నారు. ఇజ్రాయిల్ తమ యుద్ధఉన్మాదంను అమెరికా బలపరుస్తూ, సామ్రాజ్య వాద దేశానికి భయపడి, ఇతర దేశస్తులు ఎవరు కూడా వారికి వ్యతిరేకంగా పాలస్తీనా ప్రజలకు, మద్దతుగా రావడానికి సాహసించడం లేదని అన్నారు. గతంలో భారతదేశం, పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ఉండేదని,నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఇది ఇజ్రాయిల్ యుద్ధ ఉన్మాదం, సామూహిక దాడికి మద్దతు ఇవ్వడం చాలా బాధాకరమని అన్నారు. ఆవాజ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, అన్ని జిల్లాలలో ,అన్ని ప్రాంతాలలో పాలస్తీనాకు మద్దతుగా ప్రజలను సమీకరించి ఇజ్రాయిల్‌కు అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఆవాజ్ కమిటీ నగర ఉపాధ్యక్షులు నాసిర్ అహ్మద్ , ఆఫీజ్, నిస్సార్ అహ్మద్‌లు ప్రసంగించారు. ఆవాజ్ నగర నాయకులు చోటు భాయ్ ఇలియాస్, ఫయాజుల్ కరీం, చాంద్ బాషా, శాలిబాష, షేక్షావలి , బషీర్ ఇస్మాయిల్, జాఫర్, రఫీ, నబీ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎ.సుభాన్

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

## గుండమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలి : కాంగ్రెస్

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఆదోని నియోజకవర్గం నాగనాథ హల్లి గ్రామంలో పెత్తందారుల చేతిలో హత్య కు గురైన గుండమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె. బాబురావు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టర్‌కు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాబు రావు మాట్లాడుతూ ఈనెల 12న ఆదోని నియోజకవర్గం నాగనాథహల్లి గ్రామంలో దళిత మహిళ గుండమ్మను భూ తగాదాల కారణంగా ట్రాక్టర్ తో తొక్కించి హత్య చేయడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించిందన్నారు. గత ప్రభుత్వంలో ఎస్‌పిలపై దాడులు ఎక్కువగా జరిగాయని, టిడిపి ప్రభుత్వం ఏర్పడిన 50 రోజులకే రాష్ట్రంలో హత్య రాజకీయాలు ఎక్కువయ్యాయన్నారు. గుండమ్మ కుటుంబంపై అగ్రవర్ణ పెత్తందారులు దాడి చేస్తే ఇప్పటికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. పొలం తగాదాలో పెద్దల సమక్షంలో మాట్లాడితే సరిపోయేదాన్ని ఇలా హత్యలు చేసేదాక రావడం తగదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బాధిత కుటుంబాన్ని కలిసి వారికి ప్రభుత్వంచే రావలసిన నష్ట పరిహారాన్ని సత్వరమే మంజూరయ్యేలా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ ఇ. లాజరస్ డిసిసి కార్యదర్శి అబ్దుల్ హై, రెడ్డిపోగు రాజ్ కుమార్ పాల్గొన్నారు.



## విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

**ఇన్‌ఛార్జి విసి ఎన్‌టికె నాయక్**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయి నైపుణ్యాన్ని పెంపొందించు కోవాలని వర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్ పేర్కొన్నారు. సోమవారం వర్సిటీలోని లైఫ్ సైన్స్ విభాగంలో , మహిళా హాస్టల్ విభాగాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలో విద్యార్థినిలకు హాస్టల్లో మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. ఏమైనా చిన్న చిన్న రిపేర్లు ఉంటే వెంటనే వాటిని పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఎవరైనా విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కెవికె ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్**

బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ రాఘవేంద్ర చౌదరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సమన్వయ కర్త డాక్టర్ కె.అశోక్ కుమార్ నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి బదిలీ అయ్యారు. అక్కడి నుంచి డాక్టర్ కె.రాఘవేంద్ర చౌదరి బనవాసి కృషి విజ్ఞాన కేంద్రానికి బదిలీపై వచ్చారు. రాఘవేంద్ర చౌదరి ఇంతకుముందు 2017-2020 వరకు ఇక్కడ విస్తరణ శాస్త్రవేత్తగా పని చేశారు. 2018లో ఐసిఎఆర్ ఎఆర్ఎస్ శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. 2020-22 వరకు కెవికె కలికిరిలో విస్తరణ శాస్త్రవేత్తగా విధులు నిర్వహించారు. 2022-24 వరకు ఏరువాక కేంద్రం చిత్తూరులో శాస్త్రవేత్త (విస్తరణ భాగం)లో పని చేశారు. 2024 మార్చిలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాలలో బదిలీపై వచ్చి విస్తరణ నిపుణుడుగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం బనవాసి కెవికెలో సమన్వయ కర్తగా బాధ్యతలు స్వీకరించారు. ఐసిఎఆర్ ఆదర్శ గ్రామ పథకంలో నూనె గింజెల కార్యక్రమంలో ఎంపికైన తారాపురం, రంగాపురం గ్రామాలు, పెద్దకడబూరు మండలం రైతులకు టిజిజిఎస్ 1694 విత్తనం పంపిణీ, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న రాఘవేంద్ర చౌదరి

## జవహర్ నవోదయలో అవంతి లెర్నింగ్ ఇనిస్టిట్యూట్ ప్రారంభం

విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్**

బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో అవంతి లెర్నింగ్ ఇనిస్టిట్యూట్‌ను విద్యాలయ ప్రిన్సిపల్ ఇ.పద్మావతి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని 11 జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి 40 మంది విద్యార్థులు అవంతికి ఎంపికయినట్లు తెలిపారు. దీని ద్వారా 11వ తరగతి చదువుతూ, జెఇఇ లాంగ్ టర్మ్ కోచింగ్ ఇస్తామని చెప్పారు. ఈ అవంతి సెంటర్ అఫ్ ఎక్సలెన్స్ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. దీనికి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల ద్వారా వీరికి వేరుగా కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ కె.చందిరన్, అవంతి ఫౌండేషన్ అధ్యాపకులు, నవోదయ విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మాలపల్లిలో మినరల్ వాటర్ ప్లాంట్ సీజ్

**- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు - తహశీల్దార్ శ్రీధర్ మూర్తి**

సీజ్ చేస్తున్న తహశీల్దార్ శ్రీధర్ మూర్తి

**ప్రజాశక్తి - మంత్రాలయం**

మండలంలోని మాలపల్లి గ్రామంలో ఉన్న రసూల్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం సీజ్ చేసినట్లు తహశీల్దార్ శ్రీధర్ మూర్తి తెలిపారు. ఇటీవల సుంకేశ్వరి గ్రామంలో అతిసార వ్యాధితో చిన్నారి మృతి చెందడంతో పాటు మరికొందరు వ్యాధి బారిన పడి చికిత్స పొంది కోలుకున్నారు. ఈ విషయంపై జెసి నారపరెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టిడిపి నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి, తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, గ్రామీణ నీటి సరఫరా శాఖ డిఇ శ్రీనివాసులు రెడ్డి, ఎఇ వేద స్వరూపలు గ్రామాన్ని సందర్శించి సరఫరా అవుతున్న నీటిని ల్యాబ్‌కు పంపించగా సురక్షితమని రిపోర్ట్ వచ్చిందని తెలిపారు. గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి సరఫరా అవుతున్న నీటిని కూడా గ్రామస్తులు తాగుతున్నారనే విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు మాలపల్లి గ్రామంలోని రెండు వాటర్ ప్లాంట్ల నుంచి నీటిని పరీక్షించేందుకు ల్యాబ్‌కు పంపించారు. రసూల్‌కు చెందిన మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా సరఫరా అవుతున్న నీటిలో వైరస్ ఉన్నట్లు రిపోర్ట్ వచ్చిందని, దాని ఆధారంగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేసినట్లు తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఇఒఆర్‌డి ప్రభావతి, విఆర్ఓ ఆనందం పాల్గొన్నారు.

# ఇలా ఉంటే రోగాలు రావా..?

## - పట్టణంలో పడకేసిన పారిశుధ్యం

**ప్రజాశక్తి - ఆదోని**

పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. కొందరి నిర్లక్ష్యం కారణంగా శివారు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పర్యవేక్షించాల్సిన మేస్త్రీలు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుండంతో మురుగునీరు నిలిచి దోమల వృద్ధి చెంది డెంగీ, మలేరియా, డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధులతో ప్రజలు మృత్యువాత పడుతున్నారు.

**ఒకసారి ఇటు చూడండి**

పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న జైహింద్ కమాన్ పక్కన దివాకర్ రెడ్డి నగర్‌కు వెళ్లే పైపు లైన్‌లో మురుగునీరు కలిసి దుర్వాసన వస్తోంది. మురుగునీరు లీకేజీ సమస్య ఉందని మున్సిపల్ సిబ్బందికి చెబుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆ మురుగునీటినే వార్డు ప్రజలు తాగి తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

**ఎవరూ కన్నెత్తి చూడడం లేదు**

**- శ్రీనివాస ఆచారి, టిడిపి వార్డు ఇన్‌ఛార్జీ, ఆదోని**

మురుగునీటిలోనే కుళాయి పైపు ఉందని, మార్చాలని చెబుతున్నా పట్టించుకునే వారే లేరు. పైపునకు రంధ్రాలు ఉండడం వల్ల మురుగునీరు కలుస్తున్నాయి. ఆ నీరే కుళాయిల ద్వారా వస్తున్నాయి. ఆ నీటిని తాగి జ్వరాలు బారిన పడి చాలామంది ఆస్పత్రి పాలవుతున్నారు. పారిశుధ్య కార్మికులు జైహింద్ పక్కన ఉన్న ప్రాంతాన్ని కన్నెత్తి చూడడం లేదు. స్పందించి ఆ పరిసరాలను శుభ్రం చేయాలి. లేకపోతే సంబంధిత ఉద్యోగులపై అధికారులకు ఫిర్యాదు చేయిస్తాం.

## ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి

**- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ**

**ప్రజాశక్తి - ఆదోని**

ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలపై దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూడాలని తెలిపారు. అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సూచించారు. కార్యాలయపు పరిపాలన అధికారి సిఆర్.శేషయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాసరాజు, డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, డిఎల్‌పిఒ నూర్జహాన్, ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, ఆర్‌టిసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, ఆర్‌టిఒ నాగేంద్ర, డిప్యూటీ తహశీల్దార్లు వలీ బాష, పెద్దయ్య పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

**- తహశీల్దార్ పద్మజ**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

నివాస ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకుంటేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తహశీల్దార్ పద్మజ తెలిపారు. సోమవారం రామదుర్గం గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా పంచాయతీ కార్యదర్శి సిసింద్రీ, రెవెన్యూ కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో తహశీల్దార్ బృందం సచివాలయ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను, గ్రామ వీధుల పరిసరాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులతో మధ్యాహ్న భోజనం, తాగునీటిపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న తాగునీటి సంపులో ఉన్న నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో వీధుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వ వల్ల దోమలు వ్యాప్తి చెంది అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పసిపిల్లలను చాలా జాగ్రత్తగా చూసుకోవాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు. వేడి చేసిన నీటిని తాగేలా చూడాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై సచివాలయ సిబ్బంది మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపిడిఒ బరేన్ సాహెబ్ బంటనహాల్ గ్రామంలో, ఇఒఆర్‌డి బాలన్న దౌల్తాపురం గ్రామంలో పర్యటించారు.

సూచనలు ఇస్తున్న తహశీల్దార్ పద్మజ

# రోగులకు మెరుగైన సేవలు

**- గుండెపోటుకు ఉచిత ఇంజెక్షన్**

**- సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు**

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలకు అడుగులు పడుతున్నాయి. గుండెపోటుకు గురైన వారికి రూ.40 వేల విలువ గల ఇంజెక్షన్ అందుబాటులో ఉందని ఆస్పత్రి సూపరింటెండెట్ డాక్టర్ శ్రీరాములు తెలిపారు. పేద రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆయన మాటల్లోనే...

ఆదోని ప్రభుత్వాస్పత్రి

**గుండెపోటు లక్షణాలు**

ఛాతిలో నొప్పి, ఆయాసం రావడం, కడుపులో మంట, తల తిరగడం, చేతులు లాగడం, కళ్లు తిరగడం లాంటివి గుండెపోటుకు లక్షణాలు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్యుని సంప్రదించాలి. ఇప్పటివరకు సుమారు 50 మందికి ఇంజెక్షన్ ఇచ్చాం.

**రోజురోజుకు పెరుగుతున్న ఒపిలు**

వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులకు అనుగుణంగా రోగాలు సోకే వారి సంఖ్య పెరుగుతోంది. గతంలో ఒపిలు 500 ఉండేవి. ప్రస్తుతం రోజుకు 800 వరకు వస్తున్నాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో 340 బెడ్లు (మంచాలు) ఉన్నాయి. గతంలో కేవలం 100 పడకలు ఉండేవి. అన్ని రకాల రోగులకు వైద్యులు అందుబాటులో ఉన్నారు. రోగుల సంఖ్యను బట్టి 150 మంది వైద్యులు కావాల్సి ఉండగా కేవలం 72 మంది ఉన్నారు. 200 మంది నర్సులు కావాల్సి ఉండగా కేవలం 20 మంది మాత్రమే ఉన్నారు. ఆస్పత్రి నూతన మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉండి బోధనాస్పత్రిగా వ్యవహరిస్తోంది. ఎంఆర్ఐ, సిటి స్కాన్ కోసం ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రతిపాదనలు కూడా పంపాం. రోగులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

డాక్టర్ శ్రీరాములు

**24 గంటలూ సర్వీసు**

ఆదోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. గతంలో ఉదయం మాత్రమే ఒపి ఉండేది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం, సాయంత్రం ఒపి ఉంటుంది. రోగులు గమనించాలి. గుండెపోటు లక్షణాలు కనబడిన వారు మూడు గంటల్లోపు ఆస్పత్రికి వస్తే ఉచితంగా రూ.40 వేల విలువ గల ఇంజెక్షన్ ఇచ్చి గుండె వ్యాధి తీవ్రత తగ్గిస్తాం. రోగి కోలుకునే పరిస్థితి ఉంటుంది. అన్ని రకాల వ్యాధులకు వైద్యులు అందుబాటులో ఉన్నారు.

విసికి పూల మొక్క అందజేస్తున్న శ్రీనివాసులు

## డిగ్రీ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

**- విద్యార్థి జెఎసి కన్వీనర్ శ్రీనివాసులు**

**ప్రజాశక్తి - ఆదోని**

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి జెఎసి కన్వీనర్ శ్రీనివాసులు కోరారు. రాయలసీమ విశ్వవిద్యాలయం నూతన ఇన్‌ఛార్జీ విసిగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎన్‌టి.నాయక్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ... విశ్వ విద్యాలయంలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీ చేయాలని, నూతన కోర్సులు ప్రవేశపెట్టాలని, విశ్వవిద్యాలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

## నేటి నుంచి ఉపాధి వేతనాలు జమ : ఎపిఒ

**ప్రజాశక్తి - చిప్పగిరి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ నిధులను మంజూరు చేశాయని, నేటి నుంచి ఉపాధి హామీ కూలీల బ్యాంకు అకౌంట్లకు వేతనాలు జమ అవుతాయని ఎపిఒ మాధవ శంకర్ తెలిపారు. సోమవారం ఆయన మండల కార్యాలయంలో మాట్లాడారు. వేసవిలో పనులు చేసినా దాదాపు 9, 10 వారాలకు సంబంధించిన వేతనాలు రావాల్సి ఉందని, ఆలస్యం అవుతుండడంతో ఉపాధి కూలీలు కూడా ఈసారి చాలా అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ఎన్నికలు, ఎన్నికల కోడ్ ఉండడంతో చాలా ఆలస్యం అయిందన్నారు. ఉపాధి పనులు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఈ వారంలోపు వారి బ్యాంకు ఖాతాలకు వేతనాలు జమ అవుతాయని తెలిపారు. మండలంలో వర్షాలు కురుస్తుండడంతో ఉపాధి పనులు చాలా తక్కువగా జరుగుతున్నాయని చెప్పారు.

## దళితులపై దాడులు అరికట్టాలి

**- ఎన్‌టిఎఫ్ రాయలసీమ ఇన్‌ఛార్జీ ఎరుకల సూర్య**

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని నియోజకవర్గంలో దళితులపై దాడులను అరికట్టాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ ఇన్‌ఛార్జీ ఎరుకుల సూర్య, జిల్లా అధ్యక్షులు ఎరుకుల కుశలన్న కోరారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.రంజిత్ బాషను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి చైతన్యవంతులను చేయాలన్నారు. 43 గ్రామాల్లో నేటికీ కుల వివక్షత కొనసాగడం విచారకరమని తెలిపారు. గిరిజనులను ప్రలోభాలకు గురి చేసి అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకున్నారన్నారు. దర్యాప్తు చేసి న్యాయం చేయాలని కోరారు. జిల్లా ఎస్‌పితో చర్చించి అవేర్‌నెస్ కౌన్సెలింగ్ సెంటర్స్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

## వేగంగా నడిపే వారిపై కేసులు

**- ఎస్ఐ ఓబులేసు**

**ప్రజాశక్తి - ఆలూరు**

వేగంగా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ ఓబులేసు హెచ్చరించారు. ఆలూరు పట్టణం, గ్రామాల్లో పాఠశాల, కళాశాలలు వదిలే సమయంలో కొందరు పోకిరీలు, బైక్ రైడర్స్ అధిక వేగంతో వెళ్తుండడంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ ఓబులేసుకు ఫిర్యాదులు అందాయి. సోమవారం సిబ్బంది మోడల్ స్కూల్, జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల వద్ద నిఘా ఉంచారు. ద్విచక్ర వాహనాన్ని అధిక వేగంగా నడిపితే వాహనాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అధిక వేగంగా వెళ్లే బైక్‌ల ఫొటోలు పంపించాలని కోరారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే ధైర్యంగా సెల్ నెంబర్ 91211 01158కు కాల్ చేయాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లలను అదుపులో ఉంచుకోవాలని సూచించారు.

## రాజగోపురం నిర్మాణానికి విరాళం

**ప్రజాశక్తి - కౌతాళం**

శ్రీనరసింహ ఈరన్న స్వామి దేవస్థాన రాజగోపుర నిర్మాణం కోసం రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. కెపి.నరసప్ప, విశ్రాంత తహశీల్దార్, కె.సరోజమ్మ జ్ఞాపకార్థం కోసిగికి చెందిన కె.విజయ రూ.లక్షల విరాళంగా చెల్లించారని తెలిపారు. ఇఒ వెంకటేష్ దాతలకు బాండు పేపర్ అందజేసి, పూలమాలతో సన్మానించారు. సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న దాతలు

# స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

**- జెఎస్‌పి, జెఎసి జిల్లా అధ్యక్షులు నాగరాజు**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

తెలంగాణ ఐఎఎస్ స్మితా సబర్వాల్ వికలాంగులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని జెఎస్‌పి, జెఎసి జిల్లా అధ్యక్షులు బీసీ.నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల నియామకాల్లో కొన్ని సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలకు వికలాంగులు అనర్హులుగా ట్వీట్ చేశారని తెలిపారు. కొన్ని రకాల సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలు చేయాలంటే వికలాంగులకు తగిన శారీరక దృఢత్వం, ఓపిక ఉండాలని, ఇవి విశ్వసనీయతలోకి తీసుకోలేమని అన్నారని చెప్పారు. ఈ మాటను వెనక్కి తీసుకోవాలని కోరారు. స్మితా సబర్వాల్ వికలాంగుల్లో ఉన్న ప్రతిభ, పాటవాలను ఎలా అంచనా వేస్తారని ప్రశ్నించారు. వికలాంగులు ఎంతో మేధాశక్తితో ఎన్నో సామాజిక, సంక్షేమ, రాజకీయ, వ్యాపార, వాణిజ్య, విద్యా, వైద్య, వైజ్ఞానిక, క్రీడా రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకున్నారని తెలిపారు. స్మితా సబర్వాల్ వికలాంగులపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేకపోతే రానున్న రోజుల్లో చట్టపరమైన, న్యాయపరమైన ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఎమ్మిగనూరు, జిల్లా వికలాంగుల నాయకులు ఆర్ఎంపి యు.వీరేష్, ఆర్ఎంపి ఈ.రాజశేఖర్ గౌడ్, వి.నరసింహులు, సురేష్, ఈరన్న, కేశన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగరాజు

చెక్కును అందజేస్తున్న జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు

## మృతుని కుటుంబానికి బీమా చెక్కు పంపిణీ

**- జనసేన ఇన్‌ఛార్జీ రేఖగౌడ్**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును అందజేసినట్లు జనసేన పార్టీ ఇన్‌ఛార్జీ రేఖగౌడ్ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడారు. మండలంలోని గుడికల్ గ్రామానికి చెందిన బోయ వీరారెడ్డి గతేడాది జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం పొందారని తెలిపారు. వీరారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన తల్లి లక్ష్మికి మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు చేతుల మీదుగా రూ.5 లక్షల చెక్కును అందించినట్లు చెప్పారు. కార్యకర్తల సంక్షేమం కోసం జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని తెలిపారు. మృతుడు బోయ వీరారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

**- వ్యాపారుల అసోసియేషన్ నాయకులు**

**ప్రజాశక్తి - ఆదోని**

దాతలు అందించే ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వ్యాపారుల అసోసియేషన్ గౌరవాధ్యక్షులు రాజు స్వామి, గౌరవ సలహాదారులు విట్టా రమేష్, సహాయ కార్యదర్శి వీరేష్, ఉపాధ్యక్షులు సోమశేఖర్, కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం ఆదోనిలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ హైస్కూల్ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు అందజేశారు. వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎంతోమంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించి ఊరికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

## క్రీడాభివృద్ధికి సౌకర్యాలు కల్పించండి

**- ఎమ్మెల్యే పార్థసారథి**

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని నియోజకవర్గంలో ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలు, క్రీడా మైదానాలు, ప్రేక్షకులకు కూర్చోవడానికి సౌకర్యాలు కల్పించాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. సోమవారం సెక్రటేరియట్‌లో యువత, క్రీడా శాఖ కార్యదర్శి వినయ్ చంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బ్యాడ్మింటన్ కోర్టుల కోసం అధిక నాణ్యత గల మలేషియన్ వుడ్ ఫ్లోరింగ్‌తో సహా సమగ్ర క్రీడా సౌకర్యాలను సమకూర్చాలని కోరారు. లైటింగ్, టర్ఫో ఫ్యాన్లు, క్రికెట్ పిచ్, గడ్డి, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, టెన్నిస్, షటిల్, క్రికెట్, అథ్లెటిక్స్ గ్రౌండ్‌లకు అవసరమైన పరికరాలు కూడా సమకూర్చాలని తెలిపారు. నెట్‌లు, గోల్‌పోస్టులు, ట్రాక్ లైన్‌లు, ఫుట్‌బాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్, క్రికెట్, అథ్లెటిక్స్ కోసం అవసరమైన ఇతర పరికరాలతో సహా సమగ్ర సౌకర్యాలు సమకూర్చాలని కోరారు. దీనివల్ల యువత, క్రీడా ఔత్సాహికులకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

**అనుమతి పత్రాలు లేకుండా**

## బయోమందులు అమ్మితే చర్యలు

**- ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత**

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

సరైన అనుమతి పత్రాలు లేకుండా బయో మందులు అమ్మితే, అలాంటి పురుగుమందుల డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ హేమలత హెచ్చరించారు. సోమవారం గోనెగండ్లలోని బడేసా వలీ ట్రేడర్స్, మల్లికార్జున ట్రేడర్స్ విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డీలర్లు విక్రయించే బయోమందులకు జి-2, జి-3 అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. విత్తనాలు, ఎరువులు లేదా పురుగు మందులు కొన్న ప్రతి రైతుకూ తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని చెప్పారు. సరుకుకు సంబంధించిన పిసిలు అందుబాటులో ఉంచుకొని ధరల పట్టిక స్టాకు వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు.

పురుగుమందుల షాపులను తనిఖీ చేస్తున్న అధికారులు

రాస్తారోకో నిర్వహిస్తున్న హైస్కూల్ విద్యార్థులు

## బీసీ బాలుర వసతి గృహాన్ని పునః ప్రారంభించాలి

**- అధికారులు స్పందించే వరకు ఉద్యమాలు**

**- ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్ కుమార్**

**ప్రజాశక్తి- దేవనకొండ**

దేవనకొండలో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని తక్షణమే పునః ప్రారంభించాలని, బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులతో పత్తికొండ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేవనకొండకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులు వ్యయప్రాయసాలకోర్చి విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. చదువుకునేందుకు పాఠశాలలు ఉన్నా, ఉండేందుకు వసతి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవనకొండలో గత 40 ఏళ్లుగా డిఎన్‌టి వసతి గృహం ఉండేదని తెలిపారు. పక్కా గృహం లేదని, ఇతర కారణాలు చూపి, నిర్వహణ లోపంతో మూసివేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహం లేకపోవడంతో విద్యార్థులు టీసీలు తీసుకొని, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని తెలిపారు. అడ్మిషన్లు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేవనకొండలో బాలికల వసతి గృహం లేకపోవడంతో కర్నూలు, ఆదోని తదితర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారని తెలిపారు. పలుమార్లు అధికారులకు విన్నపించినా గాలికొదిలేశారని విమర్శించారు. దశలవారీ ఉద్యమాల్లో భాగంగా రాస్తారోకో నిర్వహిస్తున్నామని, అధికారులు తక్షణమే స్పందించి దేవనకొండలో బీసీ బాలుర వసతి గృహాన్ని పునః ప్రారంభించి, బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. లేకపోతే ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు మధు, మండల నాయకులు మనోజ్, సురేంద్ర, అరవింద్, మహేష్, రాము పాల్గొన్నారు.

## శ్మశాన దారి వెంట ముళ్లకంప తొలగింపు

**ప్రజాశక్తి- దేవనకొండ**

దేవనకొండలోని శ్మశాన వాటికకు వెళ్లే రహదారికిరువైపులా మూసుకుపోయిన ముళ్లకంపలను సర్పంచి రంగలక్ష్మి ఆధ్వర్యంలో ఆమె భర్త బండ్లయ్య ప్రొక్లెయిన్‌తో సోమవారం తొలగించారు. గత కొన్నేళ్లుగా ముళ్లకంప పెరిగిపోవడంతో మృతదేహాలను తీసుకెళ్లడానికి గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ముళ్లకంపను తొలగించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ముళ్లకంపలను తొలగిస్తున్న సర్పంచి భర్త బండ్లయ్య